www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 10 నవంబర్ 2024



ఉర్దూ కవితా పితామహుడు అల్లామా ఇక్బాల్


ఇక్బాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం: సారే జహాసే అచ్ఛా.. హిందుస్తాన్ హమారా గేయ రచయితగా సుప్రసిద్ధుడైన అల్లామా మహమ్మద్ ఇక్బాల్ జయంతిని స్థానిక ఖాజాపీర్ మస్తాన్ వలి దర్గాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ భారత స్వాతంత్ర పోరాటంలో తన రచనలతో ముఖ్యంగా సారే జహాసే అచ్ఛా హిందుస్తాన్ హమారా అనే జాతీయ గీతాన్ని రచించడంతోపాటు భారతదేశ సమగ్రతను కులమతాలకు అతీతంగా, భిన్నత్వంలో ఏకత్వం అనే నినాదంతో తమ కవిత్వాలతో ఎనలేని స్ఫూర్తిని నింపి చైతన్య పరిచారన్నారు. స్వాతంత్ర పోరాటంలో ప్రాణంకంటే మన భారత దేశ మట్టి గొప్పదని భారతీయులలో స్ఫూర్తి నింపారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కువైట్ బాబు, సయ్యద్‌బాషా, దర్గా కమిటీ అధ్యక్షులు సందాని బాష, సభ్యులు జబ్బార్ సాహెబ్, మౌలానా, ఇమ్రాన్, బాబ్జాన్, కరం, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

తమ్ముళ్లకు తప్పని నిరాశ!

- నామినేటెడ్ పోస్టుల్లో కడప జిల్లాకు మొండిచేయి
- అన్నమయ్యలో 'రూపా', కెకెకు చోటు
- టిడిపి శ్రేణుల్లో నిరుత్సాహం



ముక్కా రూపానందరెడ్డి, చంద్రబాబుతో కెకె చౌదరి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/రైల్వేకోడూరు/చిట్వేలి

జిల్లాలోని తెలుగు తమ్ముళ్లకు నిరాశ తప్పలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు విడతలుగా విడుదల చేసిన 89 నామినేటెడ్ పదవుల్లో ఒకరికి మినహా మిగిలిన నాయకులకు చోటు దక్కలేదు. రెండో విడతపై ఆశలు పెంచుకున్న నాయకగణం తాజాగా 59 మందితో విడుదల చేసిన రెండో విడత జాబితాలో చోటు లభించకపోవడంతో నిరుత్సాహం నెలకొంది. కడప జిల్లాకు చెందిన నాయకులకు మొండిచేయి చూపించింది. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డికి అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్, అదే నియోజకవర్గంలోని చిట్వేలి మండలానికి చెందిన కె.కె.చౌదరికి ఎపి ఖాదీ అండ్ ఇండస్ట్రీస్ బోర్డు ఛైర్మన్ పదవులు కట్టబెట్టడం మినహా ఎటువంటి ప్రయోజనమూ లభించలేదు. రాష్ట్రంలో అప్పటి అధికార వైసిపిని ఎదుర్కోవడంలో భాగంగా టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా ఏర్పడిన సంగతి తెలిసిందే. కూటమి ఏర్పాటులో టికెట్లను త్యాగం చేసిన వారికి గుర్తింపు ఉంటుందని ఊరడించారు. అటువంటి గుర్తింపు ఛాయలే కనిపించకపోవడంతో ఆశావహులకు నిరాశ తప్పలేదు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఆర్నెళ్లుగా టిడిపి కార్యకర్తలే టార్గెట్‌గా సాగిన వైసిపి దాడుల్లో వందలాది మంది కార్యకర్తలు తీవ్రంగా నష్టపోయారు. వైసిపి కేడర్ చేతిలో నష్టపోయిన కార్యకర్తలను ముందుగా ఆదుకోవాల్సిన నాయకత్వం పలుకుబడి కలిగిన నాయకులకు ప్రాధాన్యత ఇవ్వడం నిరాశ కలిగిస్తోంది. తాజాగా కూటమి నాయకత్వం విడుదల చేసిన నామినేటెడ్ పదవుల్లో కడప జిల్లాకు ఎవరికీ చోటు లభించకపోవడం గమనార్హం. మొదటి విడత జాబితాలోన 20 కార్పొరేషన్ స్థాయి పదవుల్లో డైరెక్టర్ స్థానాలకు పరిమితమైన నాయకులు తిరస్కరిస్తూ అసంతృప్తిని వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి ఏర్పాటులో భాగంగా మిత్రులకు టికెట్లను త్యాగం చేసిన వారిలో ఉమ్మడి జిల్లాలో ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాలకు చెందిన నాయకులు ఉన్నారు. జమ్మలమడుగు టికెట్ కోసం చివరి వరకు పోరాడిన భూపేష్‌రెడ్డి, ప్రొద్దుటూరు టికెట్ కోసం హోరాహోరీగా తల పడిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రైల్వేకోడూరు టికెట్ త్యాగం చేసిన పంతగాని నరసింహప్రసాద్, రాజంపేట టికెట్ త్యాగం చేసిన బత్యాల చెంగల్రాయుడు, కడపలో మైనార్టీ టికెట్‌ను సైతం వదలుకున్న సీనియర్ నాయకులు అమీర్‌బాబు వంటి నాయకులు, పార్టీ కోసం అహరహం కృషి చేసిన సీనియర్ కార్యకర్తలు, నాయకులకు తీవ్ర నిరాశను కలిగించింది. వీరితోపాటు టికెట్లు ఆశించిన స్థాయిన కలిగిన సీనియర్ నాయకులు సైతం ఉన్నారు. ఇటువంటి వారిలో ఏ ఒక్కరికీ నామినేటెడ్ పోస్టుల్లో చోటు లభించకపోవడం విస్మయాన్ని కలి గించింది.

మదనపల్లెను కుదిపేసిన ఎసిబి, సిఐడి సోదాలు

- ఫైళ్ల దగ్ధం కేసులో మాజీ ఆర్‌డిఒ మురళి ఇంట్లో సిఐడి తనిఖీలు
- ఆర్‌డిఒ బినామీ విఆర్‌ఒ శేఖర్ ఇంట్లో ఎసిబి సోదాలు
- అధికారుల తనిఖీలతో అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు


మాజీ ఆర్‌డిఒ ఇంట్లో తనిఖీ చేస్తున్న సిఐడి అధికారులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఫైళ్ల దగ్ధం కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న పూర్వపు ఆర్‌డిఒ మురళికి చెందిన నివాసాల్లో శనివారం సిఐడి అధికారులు తనిఖీలు చేశారు. మదనపల్లి పట్టణంలోని ప్రశాంత్ నగర్‌లోని మురళి నివాసంతో పాటు, తిరుపతిలో ఆయన కుమారుడు నివసిస్తున్న ఇంటిలో కూడా సిఐడి అధికారులు తనిఖీలు చేసి పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. మదనపల్లెలో సిఐడి సిఐ హేమంత్ కుమార్‌రెడ్డి బృందం పలు డాక్యుమెంట్లతో పాటు కంప్యూటర్ హార్డ్ డిస్కులను తనిఖీలు చేశారు. పాత ఆర్‌డిఒ మురళికి అనుకూలస్తుడుగా ఉన్న విఆర్‌ఒ శేఖర్ ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నాడన్న ఆరోపణలతో ఆయన ఇంటిలో ఎసిబి సిఐ మోహన్ ప్రసాద్ బృందం సోదాలు చేశారు. వైసిపి ప్రభుత్వ పాలనలో ఫ్రీ హోల్డ్ భూములను నిషేధిత జాబితాలో నుంచి తొలగించడంలో ఆర్‌డిఒ మురళి కీలక పాత్ర పోషించారనే అభియోగాలు ఉన్నాయి. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అనుచరుడుగా వ్యవహరించిన ఆర్‌డిఒ మురళి హయాంలోనే ఫోర్జరీ సంతకాలతో వైసిపి ప్రధాన నాయకులు పేదల నుంచి బలవంతంగా కొనుగోలు చేసిన భూములను ఫ్రీ హోల్డ్ జాబితాలో ఎక్కించడంలో ఆర్‌డిఒ మురళి కీలక పాత్ర పోషించారని ఆరోపణలతో ఇటీవల ఆయన సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. జూలై 21వ తేదీన మదనపల్లి సబ్ కలెక్టరేట్‌లో జరిగిన ఫైళ్ల దగ్ధం ఘటనను కూటమి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. అప్పట్లో రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు, అప్పటి సిఐడి చీఫ్ రవిశంకర్ అయ్యాన్నార్ మదనపల్లికి చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించిన విషయం తెలిసిందే. ఆ తరువాత సిఐడి అధికారులు రెండు నెలల పాటు కేసు దర్యాప్తు చేపట్టి 8 మందిపై కేసులు నమోదు చేశారు. పూర్వపు ఆర్‌డిఒ మురళితో పాటు మరో ఆర్‌డిఒ హరిప్రసాద్, కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజను సస్పెండ్ చేశారు. చాలా రోజుల వ్యవధి తరువాత మూడు రోజుల క్రితం సిఐడి అధికారులు మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని జల్లెడ పట్టి, పలు రికార్డులను పరిశీలించారు. శనివారం మరోమారు సిఐడి, ఎసిబి అధికారులు సోదాలు చేయడంతో సబ్ కలెక్ట్రేట్ ఫైళ్ల దహనం కేసు హాట్ టాపిక్‌గా మారింది. ఏ క్షణంలో ఎవరింటిని ఎసిబి, సిఐడి అధికారులు చుట్టు ముడుతారోనని అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.


గర్భిణులకు ఫలహారం పంపిణీ చేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

తల్లీబిడ్డ సంరక్షణకు ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి-పీలేరు

తల్లీబిడ్డ సంరక్షణకు ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి అని తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. ప్రతి నెలా 9వ తేదీ నిర్వహించే "పిఎంఎస్ఎంఎ" కార్యక్రమంలో భాగంగా శనివారం తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందరేగా డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులకు ఇది చక్కటి అవకాశమని, పుట్టబోయే శిశువుకి మహా భాగ్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్త్రీ వైద్య నిపుణులతో ఉచితంగా నాలుగు గర్భిణులకు పరీక్షలు, రెండు టీడీ సూది మందులు, 180 ఐఎఫ్ఎ మాత్రలు, నెల వారీ వైద్యులు సూచించిన మూత్ర, రక్త పరీక్షలు, ఆసుపత్రిలో కాన్పు సౌకర్యాలున్నాయని చెప్పారు. ప్రతి గర్భిణి ఈ వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకున్నప్పుడే తల్లీ, బిడ్డకు పూర్తి రక్షణ సాధ్యమని పేర్కొన్నారు. పర్యవేక్షకులు కుసుమ సహకారంతో 22 మంది గర్భిణుకు బ్రెడ్, పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పర్యవేక్షకులు కృష్ణయ్య, కుసుమ, ఎఎన్ఎంలు, సిహెచ్ఒలు, ఆశ కార్యకర్తలు, గర్భిణులకు పాల్గొన్నారు.

మాలమాదిగల మధ్య చిచ్చుపెట్టడం తగదు

ప్రజాశక్తి-వాల్మీకిపురం : మాలలంతా ఏకమై ఎస్‌సి వర్గీకరణను అడ్డుకుందామని మాలమ హానాడు జిల్లా అధ్యక్షులు చింతపర్తి శివయ్య అన్నారు. శనివారం స్థానిక గాంధీ బస్టాండ్ కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నినదించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసి అన్నదమ్ములుగా ఉన్న మాలమాదిగల మధ్య చిచ్చుపెట్టడం భావ్యం కాదన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు నాగార్జున, నాయకులు సుధాకర్, రమణ, వెంకటముని, రెడ్డెప్ప, సూర్యనారాయణ, నాగన్న, మధు, సుధాకర, వేణు, భాను, లక్ష్మయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా విద్యార్థులు సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం ఉందని ప్రధానోపాధ్యాయుడు హరినాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం మదనపల్లి మండలం చీకలబైలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వివిధ యూనిట్స్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శకుంతల, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. నేతాజీ స్కౌట్ యూనిట్‌ను వెంకటరమణ, ఉమాదేవి, రమణమ్మ, మదర్ థెరిసా గైడ్ యూనిట్‌ను భార్గవి, బుల్‌బుల్ యూనిటును ధ్యాన చంద్ ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాలు అలవాటు చేసుకోవాలన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా ఇప్పటి నుంచే పిల్లల్లో క్రమశిక్షణ సేవ భావాన్ని పెంపొంది స్తామన్నారు. అందుకే భారత్ స్కౌట్ యూనిట్స్ ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వసతి గృహ విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం : మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి పరిధిలోని చింతపర్తి సాంఘీక సంక్షేమ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీవిద్య విద్యార్థులను పరీక్షించి, వసతి గృహాన్ని సందర్శించి, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు వస్తున్నందున విద్యార్థులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. నీటిని కాచి చల్లారిన తర్వాత తాగాలని, జలుబు, దగ్గు, జర్వం వస్తే వెంటనే పిహెచ్‌సిలకు రావాలని సూచించారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. తాజాగా ఉండే కూరగాయలు, ఆకు కూరలను వాడాలని వంట మనుషులకు సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, సూపర్‌వైజర్ సుధాకర్, హెల్త్ అసిస్టెంట్ వలిసాబ్, ఎఎన్ఎం భారతి, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీవిద్య

దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకం ఎల్ఐసి

రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

దేశ బలమైన ఆర్థిక వ్యవస్థకు ఎల్ఐసి కీలకమని ఉద్యోగుల సంఘం నాయకులు ఎ.రఘు నాథరెడ్డి, చంద్రపాల్, సుధీకర్, నిత్యానందరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 14న ఎల్ఐసి యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆట-పాట-మాట (కళాజాతా) కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శనివారం ఎల్ఐసి కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెంగళూరులో జరిగే యూనియన్ జోనల్ మహాసభ నేపథ్యంలో హైదరాబాదు నుంచి బెంగళూరు వరకు 4 రోజులపాటు 25 మంది ఎల్ఐసి సిబ్బందితో కూడిన కళాకారుల బృందం కడపకు 14న చేరుకుని కళారూపాల ప్రదర్శన ఇస్తుందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలే దేశ భవిష్యత్తుకు ప్రాణా ధారమని చైతన్యాన్ని పెంచడం ఈ కళాజాత ఉద్దేశమని పేర్కొన్నారు. ఆర్థిక సంక్షోభాల సమయాల్లో దేశాన్ని ఆదుకున్నది ఎల్ఐసి, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలేనని తెలిపారు. ఆహార ధాన్యాల స్వయం సమృద్ధికి, ఉపాధి కల్పనకు కారణమైన రైతాంగానికి, వృత్తిదారులకు ఆర్థిక మద్దతు అందించేది ప్రభుత్వ రంగ బ్యాంకులేనని అన్నారు. పోస్టల్, టెలికం, రైల్వే, ఆయిల్, విద్యుత్, రవాణా, స్టీల్ రంగాలకు చెందిన ప్రభుత్వ రంగ సంస్థలు లేని దేశాన్ని, దాని ఆర్థిక స్వావలంబనను మనం ఊహించుకోలేమని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ రంగ సంస్థల ప్రాధాన్యతను చాలా కళాత్మకంగానూ, ఉద్బోధకంగానూ, చైతన్య పూరితంగానూ ప్రదర్శించే కళాజాత కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నేతలు అక్బర్, అమీనా పర్వీన్, శ్రీనివాసులు (ఇన్సూరెన్స్), శ్రీనివాసులు రెడ్డి, మనోహర్ (సిఐటియు), రాజామణి (మహిళా రంగం), రామకృష్ణారెడ్డి (పెన్షనర్స్), సుదర్శన్‌రెడ్డి (విద్యుత్), కుమారస్వామి (మేధావుల సమాఖ్య) లక్ష్మీ రాజా, మహేష్, గునిశెట్టి శ్రీనివాసులు (ఉపాధ్యాయ), లలిత, అజీజ్, జగదీష్ (బ్యాంకింగ్), సుబ్బారెడ్డి, రమణయ్య (పోస్టల్), రామాంజుల రెడ్డి (మెడికల్ రెప్), రాజు (సిరికల్చర్), వెంగల్ రెడ్డి, సుబ్బరామయ్య (మెడికల్) రంగాల నేతలు పాల్గొన్నారు.

చెన్నై జనోవేక్స్ టెక్నాలజీతో 'మిట్స్' ఒప్పందం

ప్రజాశక్తి-మదనపల్లి


ఒప్పంద పత్రాలను చూపుతున్న ప్రతినిధులు

మదనపల్లె సమీపంలోని మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్) విభాగం వారు ఇండస్ట్రీ ఇన్స్టిట్యూట్ ఇంటరాక్షన్ సెల్ వారి ఆధ్వర్యంలో చెన్నైలోని జనోవేక్స్ టెక్నాలజీతో అనుబంధ ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథం తెలిపారు. ఆ కంపెనీ ప్రతినిధులు అబ్దుల్ రెహమాన్, బిజినెస్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్, బాలాజీ సంపత్, సీనియర్ ప్రాజెక్ట్ లీడ్, మణిగంధాన్, బిజినెస్ అనలిస్ట్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథం అనుబంధ ఒప్పందాల ధ్రువీకరణ పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా కంప్యూటర్ సైన్స్ రంగంలోని నూతన టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్డే లెర్నింగ్, ఐఒటి మొదలైన వాటిపై శిక్షణలు, హాండ్స్ ఆన్ ట్రైనింగ్‌లు నిర్వహిస్తారని, అందులో చిన్న చిన్న ప్రాజెక్ట్స్‌తో విద్యార్థులకు ఈ నూతన టెక్నాలజీస్‌పై అవగాహన పెంచేందుకు ఈ అనుబంధ ఒప్పందం కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఐటి పరిశ్రమంలో ఈ నూతన టెక్నాలజీస్‌పై పరిశోధనలు జరుగుతున్నాయని, విద్యార్థుల కు ఇంటర్వ్యూలలో, పరిశ్రమలలో జరుగుతున్న టెక్నాలజీ డెవలప్మెంట్‌పై అవగాహన పెంచేందుకు ఇది ఒక మంచి అవకాశమని సీనియర్ ప్రాజెక్ట్ లీడర్ బాలాజీ సంపత్ పేర్కొ న్నారు. ఈ టెక్నాలజీస్‌లో ఇంటర్న్షిప్‌లతో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా మెరుగుగా ఉన్నాయన్నారు. సాఫ్ట్వేర్ మరియు హార్డ్ వేర్ రంగాలలో జరుగుతున్న మార్పులను విద్యార్థులు సకాలంలో తెలుసుకొని వాటిని నేర్చుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఇంటర్న్షిప్‌ల ద్వారా వారు చదువుతున్నప్పుడే పరిశ్రమంలో పనిచేసే అవకాశం ఉందని ఆయన అన్నారు. తమ కంపెనీలో కూడా విద్యార్థులకు ఇంటర్న్షిప్‌ల ఆఫర్ చేస్తామని సకాలంలో వాటిని విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్) విభాగాధిపతి డాక్టర్ ఎస్.పద్మ, కో-ఆర్డినేటర్స్ డాక్టర్ ఇ.సంధ్య, శాయిజ్ అహమద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలపై అఘాయిత్యాలను అరికట్టాలి

- వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి 'గడికోట'


డిఎస్‌పికి వినతిపత్రం ఇస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కూటమి ప్రభుత్వంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని, ప్రభుత్వ తప్పులు ఎత్తి చూపిస్తే మహిళలను కించపరిచే పోస్టులే కారణమని, ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, మదనపల్లి ఇన్‌ఛార్జి నిస్సార్ ఆహ్మద్ పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో డిఎస్‌పి కృష్ణమోహన్ వైసిపి కౌన్సిలర్లు, పార్టీ నాయకులు టిడిపి సోషల్ మీడియాపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సోషల్ మీడియా కార్యకర్తల అరెస్టులపై ద్వంద్వ వైఖరి విడనాడలన్నారు. మహిళలను ఏ పార్టీ కి చెందిన వారైనా సరే కించపరిస్తే చర్యలు తీసుకోవాల్సిందేనన్నారు. కేవలం టిడిపికి చెందిన వారు మహిళలుగా, వైసిపికి చెందిన వారు మహిళలు కానట్లుగా ప్రభుత్వం వ్యవహరించడం సరైందని కాదన్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై వారి కుటుంబ సభ్యులు సతీమణి, తల్లి, చెల్లి, మహిళా మంత్రులు, మహిళా ఎమ్మెల్యే, వైసిపి మహిళ నాయకులపై సైతం అసభ్యకర పోస్టులు పెట్టిన టిడిపి సోషల్ మీడియాలో ఎందుకు వదిలేస్తున్నారని ప్రశ్నించారు. స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నప్పుడు అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం ఉద్యమకారులపై అక్రమ కేసులు పెట్టిందని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా సూపర్ సిక్స్ అమలు చేయడంలో విఫలమయితే ప్రభుత్వ కర్తవ్యాన్ని గుర్తు చేస్తుంటే తప్పుడు కేసులు బనాయిస్తోందన్నారు. ఈ ప్రభుత్వానికి బ్రిటిష్ ప్రభుత్వం గతి పడుతుందని హితవు పలికారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సిపి బ్రౌన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సమితి ప్రతినిధులు

ఘనంగా సిపి బ్రౌన్ 226వ జయంతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సిపి బ్రౌన్ 226వ జయంతి ఉత్సవాలు జౌళి బజారులోని సరస్వతి విద్యా మందిరంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష సంరక్షణ సమితి జిల్లా సహాయ కార్యదర్శి గంగనపల్లి వెంకటరమణ, మండల శాఖ అధ్యక్షులు బొట్టా రామచంద్రయ్య నాయుడు, ఉపాధ్యక్షులు బివి నారాయణరాజు, తెలుగు ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం తదితరులు బ్రౌన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేల పద్యాలను రచించి ప్రజల మన్ననలందుకొని ప్రజాకవిగా కీర్తి గడించిన యోగి వేమనను ప్రపంచానికి పరిచయం చేసిన ఘనుడు చార్లెస్ ఫిలిప్స్ బ్రౌన్ అని కొనియాడారు. తాము జీవించిన కాలంలో పదిమందికీ మేలు చేసే ఎన్నో మంచి పనులు చేసి పది కాలాల పాటు గుర్తుండిపోతారని అటువంటి వారిలో తెలుగు భాషకు సేవ చేసిన విదేశీయుడు సిపి బ్రౌన్ ఒకరని పేర్కొన్నారు. ఈస్ట్ ఇండియా కంపెనీ ఉద్యోగిగా విధులు నిర్వహించేందుకు సిపి బ్రౌన్ ఆంధ్ర ప్రాంతానికి విచ్చేసి కడపలో నివసించి తన జీతాన్ని, జీవితాన్ని తెలుగు భాషకు అంకితం చేసి తెలుగు భాషాభివృద్ధికి కృషి చేశాడని కొనియాడారు. విదేశీయుడైన సిపి బ్రౌన్ తెలుగు భాష పట్ల మమకారాన్ని చూపి అనేక తాళపత్ర గ్రంథాలను సేకరించి భద్రపరిచి తెలుగు జాతికి అందించిన మహోన్నత వ్యక్తి అని వారు శ్లాఘించారు. నేడు తెలుగు భాష పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారుతున్న ప్రస్తుత తరుణంలో భాషీయులందరూ చైతన్యవంతులై భాషను కాపాడుకోకపోతే కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కనుక ప్రతి ఒక్కరూ అన్ని సందరాేలలో భాషాభిమానాన్ని చూపి తెలుగును కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నొక్కి చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోడూరు గౌరీ, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, దయాకర్, పావని, పుష్పలత, శ్రావణి, మౌనిక, మస్తానీ, సబీహ తదితరులు పాల్గొన్నారు.

జాఫరుద్దీన్‌కు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్



రాయచోటికి చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయులు షేక్ జాఫరుద్దిన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమి తరపున 2024 సంవత్సరానికి గాను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎన్నికైనారు. ఈనెల 11న విజయవాడలో జరిగే జాతీయ మైనారిటీ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. ఈయన ప్రస్తుతం రామాపురం మండలం నీలకంఠరావు పేట ఉర్దూ హైస్కూల్‌లో జీవ శాస్త్ర ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. ఉపాధ్యాయునిగా ఆయన అందించిన సేవలు, ఆజాద్ ఎడ్యుకేషనల్, మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా చేసిన సామాజిక సేవలు, ఉర్దూకవిగా, గాయకుడుగా ఉర్దూ భాషకు చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆజాద్ ఎడ్యుకేషనల్, మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు షాహుల్ హమీద్, కార్యదర్శి సిబాతుర్ రహ్మాన్ హర్షం వ్యక్తం చేశారు.

హెచ్ఐవిని ప్రారంభ దశలోనే గుర్తించి జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-పీలేరు

హెచ్ఐవి వైరస్ సోకిన ప్రారంభంలోనే గుర్తించి వైద్యుల సలహా మేరకు తగిన జాగ్రత్తలు పాటించాలని కోర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ సహకారంతో శనివారం పీలేరు కోర్ స్వచ్ఛంద సంస్థ పట్టణ శివారులోని పీలేరు-తిరుపతి మార్గంలో ఉన్న బాలికల గురుకుల పాఠశాలలో మీకు తెలుసా? హెచ్ఐవి, ఎయిడ్స్ ఎలా వస్తుందో అనే అంశంపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు హెచ్ఐవి, ఎయిడ్స్ ఎలా వస్తుంది, నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాలు తెలియజేశారు. హెచ్ఐవి స్థితిని ప్రారంభంలోనే తెలుసుకుని తగిన జాగ్రత్తలు తీసుకోక పోతే అది ఎయిడ్స్ దశకు చేరే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. హెచ్ఐవి వ్యాధి గ్రస్తుల పట్ల వివక్ష చూపవద్దని, హెచ్ఐవి, ఎయిడ్స్, క్షయ వ్యాధి, సుఖ వ్యాధులను నియంత్రించడంలో కండోమ్ ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలియజేశారు. ఎయిడ్స్ ప్రివెన్షన్ యాక్ట్ 2017, ఎఆర్‌టి మందులు, ఏపీ శ్యాక్స్ యాప్ టోల్ ఫ్రీ నెంబర్ 1097 సేవలు, సౌకర్యాలను తెలుసుకోవాలని పిల్లలకు అనగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కోర్ సంస్థ సిబ్బంది కె.రాజమ్మ, ఎస్.షర్మిల, కె.సల్మా, గురుకుల పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



కలకడ : గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-నందలూరు

ప్రధానమంత్రి మాతా సురక్షిత అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 35 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ శరత్‌కమల్, డాక్టర్ విశ్వనాథ్ తెలిపారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ గర్భిణులకు బిపి, రక్త పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. 29 మంది గర్భిణులకు గైనకాలజిస్ట్ డాక్టర్ మస్తానమ్మ స్కానింగ్ నిర్వహించి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారని చెప్పారు. ఈ సందర్భంగా రాయల్ సేవా సమితి అధ్యక్షులు గంగనపల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో రోగుల కొరకు 300 ఒపి పుస్తకాలను వైద్యాధికారులకు అందించారు. అనంతరం గర్భిణులు, ఆశా కార్యకర్తలకు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ వెంకట నారాయణ, సూపర్వైజర్ సునీల్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు. **కలకడ:** గర్భిణులకు తప్పనిసరిగా వైద్య సేవలు పొందాలని కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మల్లికార్జున పేర్కొన్నారు.మండల కేంద్రమైన కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భవతుల నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గర్భము దాల్చిన ప్రతి స్త్రీ ప్రభుత్వ వైద్యశాలల్లోనే వైద్య సేవలు పొందాలని సూచించినట్లు తెలిపారు. ఆశా కార్యకర్తలు గర్భిణుల ఇళ్లను సందర్శించి వారికి కావలసిన వైద్య సేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మోహన్, హెల్త్ ఎడ్యుకేట్ రాజమ్మ, ఫిమేల్ హెల్త్ సూపర్‌వైజర్ రామకృష్ణమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

14న మదనపల్లెకు మంద కృష్ణ రాక

ప్రజాశక్తి-కలకడ

ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాప అధ్యక్షులు మందకృష్ణమాదిగ ఈనెల 14న మదనపల్లిలో నిర్వహించే మాదిగల ఆత్మీయ సదస్సును విజయవంతం చేయాలని ఎం ఆర్‌పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుద్ధ రామకృష్ణ మాదిగ పేర్కొన్నారు. మండల ఎంఆర్‌పిఎస్ కలకడ మండల అధ్యక్షులు వంగిమళ్ళ హరినాథ్‌మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి దుడ్డు రామకృష్ణ మాదిగ, ఎంఎస్‌పి పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండికోట వెంకటేష్ మాదిగ, ముదివేడు శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. మందాక్రిష్ణ మాదిగ గత 30సంవత్సరాలుగా మాదిగ, ఉపకులాల ఉజ్వల భవిష్యత్ కోసం అలుపెరగడని పోరాటం చేశారు. ఎస్‌సి వర్గీకరణకు అలుపెరగని పోరాటం చేసి సాధించారని అన్నారు. మండలం లోని ప్రతి మాదిగపల్లి నుంచి మాదిగల ఆత్మీయసభకు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి నాయకులు జీవి రమణ మాదిగ, వర్ల రెడ్డెయ్య మాదిగ, బోయని వెంకటేశ్వర మాదిగ, కఠారి గంగాధర్ మాదిగ, వంగిమాళ్ళ కుమార్ మాదిగ, డాక్టర్ వర్ధన్ పాల్గొన్నారు. **తంబళ్లపల్లి:** మదనపల్లెలో ఈ నెల 14న చౌడేశ్వరి కల్యాణ మండపంలో జరిగే ఎం ఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ సభకు మాదిగ సోదరులు తరలి రావాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు నరేంద్రబాబు పిలుపునిచ్చారు. శనివారం స్త్రీ శక్తి భవన్లో మండల ఎమ్మార్పీఎస్ నాయకులతో చర్చ సమావేశం జరిగింది. 30 ఏళ్ల అలుపెరగని సుదీర్ఘ పోరాటంతో ఎస్సీ వర్గీకరణ పై సుప్రీం కోర్ట్ లో కూడా విజయం సాధించిన సంద ర్భంగా మందకృష్ణ మాదిగ మదనపల్లికి వస్తున్నారన్నారు. అత్యధిక సంఖ్యలో సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. జన సమీకరణ కోసం మండల స్థాయి నాయ కులకు బాధ్యతలు అప్పగించారు. సమావేశంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు శివ, మల్లి కార్జున, వెంకటప్ప, గోపిదిన్నె మల్లికార్జున, బ్రహ్మయ్య, మారప్ప పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ కోసం ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ఉచిత గ్యాస్ లబ్ధి కొరకు లబ్ధిదారులు ఇకెవైసి తప్పనిసరిగా చేసుకోవాలని తహశీల్దార్ ధనంజయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన రెవెన్యూ కార్యాలయంలో గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దీపం-2 పథకం ద్వారా బియ్యం కార్డు కలిగిన లబ్ధిదారులకు ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను అందిస్తోందని అన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం ద్వారా లబ్ధి పొందాలంటే లబ్ధిదారులు తప్పనిసరిగా గ్యాస్ ఏజెన్సీ కేంద్రాల వద్ద, గ్యాస్ డెలివరీ సిబ్బంది వద్ద ఇకెవైసి చేయించుకోవాలని సూచించారు. గ్యాస్ కనెక్షన్ కు ఇకెవైసి, బ్యాంకు ఖాతాకు ఆధార్ కార్డు నెంబర్‌ను అనుసంధానం చేయించుకొని ఉండాలన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ లబ్ధిపై ఎటు వంటి సందేహాలు ఉన్నా గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యాన్ని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో సిఎస్‌డిటి ఫిరోజ్‌ఖాన్, ఆర్‌ఐ అనంతలక్ష్మి, సీనియర్ అసిస్టెం ట్ రాంప్రసాద్, ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్‌కుమార్, సిబ్బంది, పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-పుల్లంపేట



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బనరసారెడ్డి

రాజంపేట పార్లమెంట్ స్థాయిలో విభిన్న ప్రతి భావంతుల దినోత్సవం సంద ర్భంగా పుల్లంపేట విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘం అధ్యక్షుడు మల్లు సుబ్బ నరసారెడ్డి, రాజంపేట సభ్యుడు వెంకట ప్రసాద్ విభిన్న ప్రతి భావంతుల దినోత్సవం సంద ర్భంగా పర్యటన చేపట్టినట్లు తెలిపారు. ఈ పర్యటన భాగంగా మండల సంఘం నాయకులకు సమావేశం ఏర్పాట్లు గురించి చర్చించి నట్లుతెలిపారు. పెనగలూరులో విభిన్న ప్రతిభావంతుల సంఘం నాయకులతో సమావేశంలో పాల్గొన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సుబ్బనర సారెడ్డి మాట్లాడుతూ రాజంపేటలో నిర్వహించే విభిన్న ప్రతిభా వంతుల దినోత్సవంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సేవా దృక్పథం కలిగి నటువంటి విభిన్న ప్రతిభావంతులను గుర్తించి వారికి సన్మాన కార్యక్ర మం కూడా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. రాజంపేట సభ్యుడైన వెంకట ప్రసాద్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు సమస్యలపైన ఈ దినోత్సవం రోజు చర్చ జరుగు తుందని అందరూ పాల్గొని తమ సమస్యలను తెలియజేయ వచ్చునని అన్నారు.ఈ సమావేశంలో పెనుగలూరు అధ్యక్షుడు తిరుపాల్, గౌరవ అధ్యక్షులు తిరుమలరెడ్డి, ఉపాధ్యక్షుడు మురళి, కార్యదర్శి సుబ్బ నరసయ్య, సభ్యులు లోకేష్ నారాయణ, సూర్య ఆదినారాయణ శివకుమార్ పాల్గొన్నారు.

నిర్మాణానికి నోచని తహశీల్దార్ కార్యాలయం

- ఆరేళ్లుగా పునాదులకే పరిమితం
- ఇప్పటికైనా పూర్తి చేయాలని కోరుతున్న మండల ప్రజలు



పునాదులతో నిలిచిపోయిన తహశీల్దార్ కార్యాలయ భవన నిర్మాణాలు

ప్రజాశక్తి-వీరబల్లి

మండల కేంద్రం వీరబల్లిలో తహశీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి ఆరేళ్ల క్రితం వేసిన పునాదులు నేటికీ పునాదులుగానే దర్శన మిస్తున్నాయి. మండలానికి కొత్త తహశీల్దార్ భవనం నిర్మాణం జరుగుతుందని మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఆ సంతోషం ప్రజలలో కలగానే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2018లో అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో కోటి రూపాయలతో తహశీల్దార్ భవన నిర్మాణానికి చర్యలు చేపట్టింది. పునాదులు పూర్తి చేసే సమయానికి ప్రభుత్వం మారడంతో నిధులు గుత్తేదారుకు అందలేదు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదార్లు భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు. పిల్లర్ల దశలోని పనులు నిలిచి అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ఆ తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం భవన నిర్మాణంపై కన్నెత్తి కూడా చూడక పోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ప్రస్తుతం పిల్లర్ల కోసం వినియోగించిన ఇనుప కడ్డీలు తుప్పు పట్టి పోయాయి. పునాదుల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోయి అధ్వానంగా తయారయ్యాయి. కనీస సౌకర్యాలు లేకపోవడంతో తహశీల్దార్ కార్యాలయ ఉద్యోగులు విధులు నిర్వహించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొని తహశీల్దార్ భవన నిర్మాణం పూర్తిచేయాలని 12 గ్రామ పంచాయతీల ప్రజలు కోరుతున్నారు.

నూతన తహశీల్దార్ భవన నిర్మాణం పనులు చేపట్టాలి



వీరబల్లి మండలంలో ఎన్నో ఏళ్లుగా తహశీల్దార్ భవనం అద్దె భవనంలోనే సాగుతోంది. 2018లో అప్పటి టిడిపి ప్రభుత్వం చేపట్టిన తహశీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులు చేపట్టాలి. అద్దె భవనం దగ్గర ప్రజలు ఉండేందుకు సౌకర్యంగా లేదు. ఇరుకైన భవనంలో అధికారులు కూర్చోవడానికి ఇబ్బంది పడుతున్నారు.

-పెద్దివీటి రామ్మోహన్, వీరబల్లి


ప్రభుత్వ భవనమే కావాలి



మండలంలో తహశీల్దార్ కార్యాలయం అద్దె భవనంలో ఉండటంతో ఇబ్బందులు పడుతున్నాం. జనాల రద్దీతో ఉద్యోగులు కూడా అవస్థలు పడుతున్నారు. పెండింగ్‌లో ఉన్న కొత్త భవనం నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలి. అధికారులకు కూర్చోవడానికి, ప్రజలు ఉండ డానికి సౌకర్యంగా ఉండే కార్యాలయం కావాలి. ప్రభుత్వాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నిలిచిపోయిన తహశీల్దార్ కార్యాలయాన్ని పూర్తి చేయాలి.

-దుగ్గనపల్లి సురేంద్రరెడ్డి, వీరబల్లి

భూ సమస్యలను పరిష్కరించండి : జెసి



రికార్డులను తనిఖీ చేస్తున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

ప్రజాశక్తి-గాలివీడు

రైతులు, ప్రజల నుంచి వచ్చే భూసమస్యలను సత్వరమే పరిష్కరించేలా కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం తహశీల్దార్ కార్యాలయాన్ని జెసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫకీరారెడ్డిగారిపల్లి వద్ద నున్న ప్రాథమిక సహకారపరపతి సంఘాన్ని పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో ఫ్రీహోల్డ్ భూముల ఫైళ్లను, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. పెండింగ్ లో ఉన్న పనులను తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. చుక్కల భూముల పైన కూడా సరైన నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ భాగ్యలత డిటి.శ్రీధర్‌రెడ్డి, ఆర్‌ఐ బాలాజీ, విఆర్‌ఒలు అల్లా బకాష్, రవీంద్రారెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ఓటరు జాబితా నవీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహశీల్దార్ ధనుంజయులు తెలిపారు. శనివారం మండల వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల వద్ద బిఎల్‌ఒలు నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలకు సంబంధించిన ఫోటో ఓటర్ల జాబితా నిరంతర నవీకరణ ప్రక్రియను పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ స్థాయి అధికారులు ఈనెల 9వ,10 వ తేదీలలో, 23,24వ తేదీలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుం దన్నారు. ఇందులో ఓటు విలువపై అవగాహన కల్పిస్తారని అన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేయడం, మృతి చెందిన వారిని తొలగించడం వంటి సవరణలను చేపడతారని వివరించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఇది మంచి అవకాశం అని, కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అనంతలక్ష్మి, మండల సర్వేయర్ గోపీనాథ్, సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, విఆర్‌ఒలు, విఆర్‌ఎలు, బిఎల్‌ఒలు, ప్రజలు పాల్గొన్నారు.



ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్

సంఘాలు సెర్ప్ యాప్‌లో నమోదు చేసుకోవాలి : ఎపిఎం



మాట్లాడుతున్న ఎపిఎం దేవసేన

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని స్వయం సహాయక సభ్యులకు సంబంధించిన వివరాలు ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెర్ప్ యాప్ తప్పక నమోదు చేయాలని ఎపిఎం దేవసేన పేర్కొన్నారు. శనివారం మండల వెలుగు కార్యాలయంలో సిసిలు గ్రామాలకు చెందిన ఆనిమేటర్ల సమావేశంలో పలు విషయాలు చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో స్వయం సహాయక గ్రూపులకు సంబంధించిన లబ్ధిదారులు ఒక్కొక్క సంఘంలో పదిమంది సభ్యులు ఉంటారని ఆ సభ్యులకు సంబంధించిన వివరాలు స్థానిక విఒఎలు ప్రతి సంఘ సభ్యురాల వద్దకు పోయి ప్రస్తుతం వచ్చిన యాప్‌లో వారి కుటుంబ వివరాలు, తలసరి ఆదాయం, పిల్లల వివరాలు, గ్యాస్ కనెక్షన్ల వివరాలు, ఆదాయ వివరాలు తప్పక పొందుపరచాలని ఆమె తెలిపారు. స్వయం సహాయక గ్రూపులు సిక్ కాకుండా చూడాలని ఒకవేళ సిక్ అయిన గ్రూపులను తిరిగి పునరుద్ధరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని సిసి, విఒఎలకు సూచించారు. స్వయం సహాయక సంఘాలు తీసుకుంటున్న రుణాలు సకాలంలో చెల్లిస్తున్నారా లేదా రుణాలు తీసుకుంటే ప్రతినెలా క్రమం తప్పకుండా వారి వద్ద బ్యాంకులకు చెల్లించే విధంగా విఒఎలు కృషి చేయాలని అన్నారు. గ్రూపు సభ్యుల వివరాలు వారి రుణాల వివరాలు అప్పుడప్పుడు ఆయా గ్రామాలకు కేటాయించిన సిసిలు పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ప్రతి గ్రూపు సభ్యుల వద్దకు స్థానిక విఒఎలు క్రమం తప్పకుండా పోయి గ్రూపులను సక్రమంగా నడిపించేందుకు కృషి చేయాలని తెలిపారు. డ్వాక్రా సంఘాల్లో బ్యాంకు రుణాలు స్త్రీనిధి రుణాలు వంటివి క్రమం తప్పకుండా చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సిసిలు ఆదినారాయణ, నాగరాజు, నరసింహులు, గంగాధర, రెడ్డి బాబు పాల్గొన్నారు.

వీధి కుక్కల స్వైర విహారం

భయాందోళనలో పట్టణ ప్రజలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్థానిక నగర పంచాయతీలో వీధి కుక్కల స్వైర విహారం చేస్తున్నాయి. ఒక్కరోజే ఏడుగురు కుక్క కాటుకు గురి కావడం పట్టణ ప్రజలను ఆందోళన కలిగిస్తోంది. కుక్కకాటు బారినపడ్డ వారి సంఖ్య ప్రభుత్వాసుపత్రిలో రోజురోజుకు పెరుగుతోంది. వీధి కుక్కలు బెడద నుండి కాపాడాలని అధికారులకు పలుమార్లు పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు వాపోతున్నారు. వీధులలో తిరగాలంటే భయంగా ఉందని ఆందోళన చెందుతున్నారు. పట్టణంలో వీధికుక్కలు ప్రజలను ఇబ్బంది పెడుతున్న వీధి కుక్కల కుటుంబ నియంత్రణ నిర్వహిస్తామని చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారే తప్ప, చర్యలు చేపట్టలేదని ప్రజలు పేర్కొంటున్నారు. కుక్క కాటుకు గురైన వారి సంఖ్య వందల సంఖ్యలో ఉన్నపట్టికి ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఏడుగురు కుక్క కాటుకు గురైనట్లు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. వృద్ధులు, చిన్నారులు ఇళ్లు విడిచి బయటికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు స్పందించి రోజురోజుకు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.



బస్టాండ్ ఆవరణంలో గుంపులుగా సంచరిస్తున్న వీధికుక్కలు



కుక్క కాటుకు గురై ఆస్పత్రిలో చేరిన బాధితులు

పచ్చని చెట్లు దేశ ప్రగతికి మెట్లు

ప్రజాశక్తి-పీలేరు

పచ్చని చెట్లు దేశ ప్రగతికి మెట్లు అని పీలేరు తహశీల్దార్ భీమేశ్వరరావు తెలిపారు. శనివారం పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ కార్యా లయం పరిసరాలను శుభ్రం చేసి, ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా తహ శీల్దార్ మాట్లాడుతూ చెట్లను విస్తారంగా నాటడం వల్ల అవి పెరిగి పెద్దవై, భవిష్యత్తులో మనకు మంచి గాలిని అందించి మన ఆరోగ్యాన్ని కాపాడుతాయని అన్నారు. వర్షాలు కూడా సకాలంలో కురవడానికి ఉపయోగపడతాయని అన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటికి ఒక మొక్క వంతున నాటి వాటిని పెంచి పెద్దవి చేయాలని కోరారు. కార్యక్రమంలో డిటి సుబ్రహ్మణ్యం, విఆర్‌ఒ హేమంత్ నాయక్, మండల సర్వేయర్ కిరణ్ మయి, విఆర్‌ఏలు రత్న, ఆది, రెడ్డప్ప పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న రెవెన్యూ సిబ్బంది

క్రైం కార్నర్



నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

హత్య కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలోని రెడ్డివారిపల్లె సమీపంలోని చోడవరం చెరువు వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ఈనెల 6న పితాని వెంకటనారాయణ అనే వ్యక్తిని గొంతు కోసి హత్య చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు సిఐ హేమ సుందర్‌రావు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హత్యకు గురైన వెంకటనారాయణ రెండు సంవత్సరాల క్రితం అస్గర్ అలీ అనే వ్యక్తి ఇంటిని బాడుగకు తీసుకొని కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడని తెలిపారు. అనంతరం బాడుగ నగదు విషయంలో ఇంటి ఓనర్ అస్గరాలి తల్లిని మద్యం మత్తులో అసభ్యకరంగా దూషించాడని తెలిపారు. అది మనసులో పెట్టుకొని అస్గరాలి తన స్నేహితుడైన కోడూరుకు చెందిన సునీల్ తేజ సహకారంతో ఈనెల 6న కోడూరుకు వచ్చిన వెంకటనారాయణతో కలిసి మద్యం సేవిస్తామని చెప్పి రెడ్డివారిపల్లె చోడవరం చెరువు వద్ద తోటలోకి తీసుకెళ్లారని చెప్పారు. రాత్రి వరకు మద్యం సేవించి స్నేహితుడైన సునీల్‌తేజ సహకారంతో అస్గరాలి వెంకటనారాయణ గొంతులో కత్తితో పొడిచి హత్య చేశారని తెలిపారు. ఈ కేసును చేదించిన సీఐ రామచంద్రరావు, ఎస్ఐ నవీన్ కుమార్, టెక్నికల్ సిబ్బందిని ఎస్‌పి, డిఎస్‌పిలు అభినదిచారని తెలిపారు.

దొంగతనం కేసులో నలుగురు దొంగలు..

-16 గ్రాముల చైన్, మోటార్ బైక్ స్వాధీనం

ప్రజాశక్తి-చిట్వేలి

తరచుగా దొంగతనాలకు అలవాటుబడ్డ నలుగురు వ్యక్తులను శనివారం మధ్యాహ్నం అంబేద్కర్ విగ్రహంవద్ద ఆదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి 16గ్రాముల బంగారు చైను, మోటార్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు రైల్వేకోడూరు రూరల్ సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయాన మాట్లాడుతూ గత నెల 21న చిట్వేలి చర్చి సమీపంలో కోలే సుబ్బమ్మ అనే మహిళను బెదిరించి ఆమెమెడలో ఉన్నబంగారు చైన్‌ను తీసుకెళ్లారని చెప్పారు. బాధితురాలు ఈనెల 5న పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎస్ఐ రఘురాం కేసు నమోదుచేసుకొని అన్నికోణాల్లో దర్యాప్తు మొదలుపెట్టడంతో పాటు ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఎస్ఐకు అందిన సమాచారంతో సిబ్బందితో పోలీసు వాహనంలో వెళుతుండగా పోలీసులను చూసి అంబేద్కర్ విగ్రహంవద్దనున్న నలుగురు వ్యక్తులు మోటార్ బైక్‌పై పారిపోతుండగా వెంబడించి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన వీరు ప్రస్తుతం అనంతపురం జిల్లా గుంతకల్ లోనివాసం ఉంటున్న మోసిన్, షేక్ హైదర్ ఆలీ, సయ్యద్ రసిక్యూ హుస్సేన్, అజీజ్ జాఫ్రీ ఆలిరాజా ఆజీజ్‌గా గుర్తించినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి 16 గ్రాముల బంగారు చైన్ మోటార్ బైక్‌ను స్వాధీనం చేసుకొని రాజంపేట కోర్టులో హాజరుపరిచామని సిఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ రఘురాం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతులకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్/తంబళ్లపల్లి

రోడ్డు ప్రమాదంలో రైతులు తీవ్రంగా గాయపడినట్లు తంబళ్లపల్లి ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. పీలేరు మండలం నగిరి మడుగు చెందిన రైతులు వెంకటరమణ, రెడ్డప్పలు శనివారం ద్విచక్ర వాహనంలో తంబళ్లపల్లె మండలం, గోపిదిన్నెకు బయల్దేరారని తెలిపారు. మార్గ మధ్యలోని గోపిదిన్నె క్రాస్ వద్ద వేగంగా వచ్చిన ఆటో వీరిని ఢీకొట్టిందని అన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరు రైతులు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. 108 సిబ్బంది మనోహర్, రఫీ క్షతగాత్రులను మదనపల్లె జిల్లా ప్రభు త్వాసు పత్రికి తరలించినట్లు చెప్పారు. వీరిలో రెడ్డప్ప పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో ప్రధమ చికిత్సల అనంతరం తిరుపతి రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చేనేత కార్మికుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



హరి (ఫైల్ ఫొటో)

మదనపల్లె, నీరుగట్టు వారిపల్లెలో చేనేత కార్మికుడు మగ్గానికే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం తీవ్ర కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు.. సత్యసాయి జిల్లా, సోమందేపల్లికి చెందిన రామయ్య కొడుకు చేనేత కార్మికుడు సి.హరి(45) మదనపల్లె పట్టణం, నీరుగట్టు వారిపల్లిలోని మారుతి నగంలో నివాసం ఉంటున్నాడని తెలిపారు. చేనేత మగ్గాలు నేసుకుంటూ జీవనం చేసేవాడని చెప్పారు. కొంత కాలంగా అనా రోగ్యంతో బాధపడుతున్నాడని, భార్య అలిగి పుట్టింటికి వెళ్లిపోయిందన్నారు. ఏమి జరిగిందో ఏమో తాను నేచే మగ్గానికే ఉరివేసుకుని బలవన్మరణం చెందా డని తెలిపారు. సంఘటన స్థలాన్ని మదనపల్లె ఒకటవ పట్టణ సిఐ చాంద్ భాషా పరిశీలించారు. సత్యసాయి జిల్లాలో ఉన్న మృతుని భార్య హేమావతి, పిల్లలు చరణ్, వరుణ్‌లకు సమాచారం అందించినట్లు తెలిపారు. భార్య అలిగి పుట్టినిం టిలో ఉండడం వల్ల మనస్తాపంతో ఉరి వేసుకున్నాడా లేక అనారోగ్యం తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడా అన్నది పోలీసు విచారణలో తేలాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

50 కిలోల గంజాయి స్వాధీనం : సిఐ

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని అనుంపల్లి పోలీసు చెక్ పోస్టు సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం కారుసహా 50కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రైల్వేకోడూరు రూరల్ సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి వివలరాలు వెల్లడించారు. ఎస్‌పి, రాజంపేట ఎస్‌డిపిఒ ఆదేశాల మేరకు గంజాయి అక్రమనిల్వ, రవాణా, అమ్మకం గురించి ఖచ్చితమైన సమాచారం మేరకు తాశీల్ధార్ మోహన్ కృష్ణ, సిబ్బంది, ఓబులవారిపల్లి ఎస్ఐ మహేష్, చిట్వేలి ఎస్ఐ రఘురాం, సిబ్బంది కలసి చెక్‌పోస్టు వద్ద శుక్రవారం మధ్యాహ్నం3.30 గంటల సమ యంలో నిఘా వేసినట్లు తెలిపారు. రాపూరు వైపు నుంచి చిట్వేలి వైపు వస్తున్న కారు తమను చూసి కారు ఆపి పారిపోతుండగా వెంబడించి అదుపులోకి తీసు కున్నట్లు చెప్పారు. కారును తనిఖీ చేయగా అందులోఉన్న 50కిలోల గంజాయిని, కారును, నిందితుడు శ్రీకాళహస్తికి చెందిన సాయిచైతన్యను పంచాయితీ దారుల సమక్షంలో అదులోకి తీసు కున్నట్లు తెలిపారు. 50కిలోల గంజాయి సుమారు10లక్షల విలువ చేస్తుం దని తెలిపారు.కేసు నమోదుచేసి నిందితుడు సాయి చైతన్యను శనివారం రాజంపేట కోర్టుకు హాజరుపరిచినట్లు సిఐ తెలిపారు.అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు